

దూకుడు

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వేగం పెంచిన పార్టీలు
- కోస్గి సభలో ఎన్నికల శంఖారావం పూరించిన సీఎం రేవంత్‌రెడ్డి
- సంకల్ప యాత్రతో హాట్‌హాట్‌గా పాలమూరు రాజకీయం
- కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి పేరును ప్రకటించిన సీఎం
- ఇంకా స్తబ్దుగానే బీఆర్‌ఎస్ ప్రచారం



విజయ సంకల్పయాత్రలో అభివాదం చేస్తున్న బీజేపీ నాయకులు(ఫైల్)

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు దూకుడు పెంచాయి. ఆయా పార్టీల ప్రణాళికలతో ప్రచార సరళిని ప్రారంభించాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పేరును సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రకటించగా.. బీజేపీలో టిక్కెట్ ఆశిస్తున్న నాయకులు బీజేపీ విజయ సంకల్పయాత్ర పేరుతో పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ ఇప్పటికే పాలమూరు న్యాయయాత్ర పేరుతో మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్ర పూర్తిచేసింది. బీజేపీ విజయసంకల్ప యాత్ర కూడా కృష్ణ మండలం నుంచి మొదలై.. మక్తల్, నారాయణపేట, దేవరకద్ర, మహబూబ్‌నగర్, కొడంగల్ నియోజకవర్గాల్లో పూర్తిచేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం, ఈ పార్లమెంట్‌కు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తుండటంతో కాంగ్రెస్ గెలుపు నల్లేరు మీద నడకే అవుతుందని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతుండగా.. గత పార్లమెంట్ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలవడంతోపాటు మోదీ చరిష్మా, అయోధ్య రామమందిరం, విజన్ 2047 ప్రధాన ఎజెండాలుగా తమ పార్టీ గెలుస్తుందని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ చల్లా వంశీచంద్‌రెడ్డి పేరును ఖరారు చేసి.. ఒకడుగు ముందుకు వేయగా.. బీజేపీలో ఎవరికి టికెట్ కేటాయిస్తారనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఎవరికి వారు తామే బరిలో ఉంటామని ప్రకటించుకుంటున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఉలుకు పలుకు లేదని చెప్పవచ్చు. అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓటమిచెందడంతో ఎవరూ పోటీకి ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. ప్రస్తుత ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికే ఆ పార్టీ టికెట్ కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు దూకుడుగా ముందుకెళ్తుండగా.. బీఆర్‌ఎస్ మాత్రం ఇంకా స్తబ్ధుగా ఉండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం కనిపిస్తోంది.

ప్రాజెక్టులే ఎజెండా...

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులే ప్రధాన ఎజెండాగా ఈ ఎన్నికల్లో అన్ని పార్టీలు ప్రచార సరళిని కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదాపై కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పాలమూరు- రంగారెడ్డికి 2014లో జాతీయ హోదా ఇస్తానని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీపై సమాధానం చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి కోస్గి సభలో ప్రశ్నించారు. దీనికి కౌంటర్‌గా గురువారం విలేకరుల సమావేశం నిర్వహించడంతోపాటు.. బీజేపీ విజయసంకల్ప యాత్రలో డీకే అరుణ కామెంట్ చేస్తూ పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును తాము కొట్లాడి తెచ్చుకుంటే.. ఆ రోజు టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి అడ్డుకున్నారని, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే విభజన చట్టంలో ఎందుకు పొందుపర్చలేదని బదులిచ్చారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞంలో భాగంగా ఏర్పాటు అయ్యాయని, ఇప్పుడు సాగునీరు అందుతున్న ప్రాంతాలకు కాంగ్రెస్ వల్లే మేలు జరిగిందని ఆ పార్టీ నేతలు చెబుతుండగా.. తాను ఉపవాసాలు, నిరసన దీక్షలు, రాయలసీమ ప్రజలతో కొట్లాడి ప్రాజెక్టులను సాధించానని డీకే అరుణ ప్రకటిస్తున్నారు. ఈ మాటల యుద్ధం ఇంకా కొనసాగే అవకాశం ఉంది. అలాగే కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కే ఆర్‌ఎంబీకి అప్పగించడంపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య అసెంబ్లీ వేదికగా మాటల యుద్ధం కొనసాగగా.. కాంగ్రెస్ శ్వేతపత్రం కూడా రిలీజ్ చేసింది. బీఆర్‌ఎస్ కూడా ఎన్నికల శంఖారావాన్ని పూరించి.. ప్రచారంలోకి దిగితే పాలమూరు ప్రాజెక్టులు ఇతివృత్తంగా ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుంది.



వంశీచంద్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించి.. అభివాదం చేయిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

ఎవరి ధీమా వారిదే...

గత పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ఉండటం.. ఆ పార్టీ అభ్యర్థి గెలుపొందారు. రెండోస్థానంలో బీజేపీ, మూడో స్థానంలో కాంగ్రెస్ పార్టీలు నిలిచాయి. అయితే అప్పటికీ.. ఇప్పటికీ పరిస్థితి తారుమారైంది. గత ఎన్నికల్లో మొత్తం ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ వారు కాగా.. ప్రస్తుతం మొత్తం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిన సింపతి అటు బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న డీకే అరుణకి, ఇటు కాంగ్రెస్ అభ్యర్థిగా ఖరారైన వంశీచంద్‌రెడ్డికి ఉన్నాయి. మోదీ చరిష్మా, తనకు ఉమ్మడి జిల్లాపై ఉన్న పట్టు.. గతంతో పోలిస్తే బీజేపీకి ఎక్కువ ఓట్లు పోలరైజేషన్ అవుతుండటం, గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలవడం తనకు కలిసి వస్తుందని బీజేపీ నాయకులు భావిస్తుండగా.. ఇప్పటికే అభ్యర్థిగా ఖరారు కావడం, ఎమ్మెల్యేలంతా తమ పార్టీకి చెందిన వారే కావడం, అందరూ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవడంతో విజయం సాధిస్తానని వంశీచంద్‌రెడ్డి నమ్మకంతో ఉన్నారు. పైగా ఈ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉండటం కూడా కలిసి వస్తుందనే అభిప్రా యం ఆయనలో ఉంది. ఇక బీఆర్‌ఎస్‌కు కార్యకర్తల బలం ఉన్నప్పటికీ.. అసెంబ్లీలో ఓటమి తర్వాత నేతలు ఎవరూ క్రియాశీలకంగా కార్యక్రమాల్లో పాల్గొనడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థి ఖరారైతే ఆ పార్టీ ఏ మేరకు ఎన్నికల్లో ప్రభావం చూపుతుందనేది తెలియనుంది.

నామినేటెడ్ 'ఆశలు'

- రేసులో సుహాసన్‌రెడ్డి, బాలాజీసింగ్, సురభి వేంకటేశ్వర్‌రావు
- పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ముమ్మర ప్రయత్నాలు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నోటిఫికేషన్ వెలువడక ముందుకే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో జిల్లాల వారీగా కాంగ్రెస్ పార్టీ విజయావకాశాల కోసం శ్రమించిన వారి జాబితాను ఇంటలిజెన్స్ వర్గాలు సేకరిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి బిజినేపల్లికి చెందిన సుహాసన్‌రెడ్డి పేరు ప్రధానంగా తెరమీదకొస్తున్నది. ఆయనకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి లేదా జడ్పీ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నప్పటికీ ఆయన అనుచరులు మాత్రం రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి కావాలని గట్టిగా పట్టుబడుతున్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కష్టనష్టాల్లో ఉన్నప్పుడు పార్టీని నిలబెట్టుకునే క్రమంలో ఆర్థికంగా అనేక విషయాల్లో నష్టపోయిన సుహాసన్‌రెడ్డికి చైర్మన్ పదవి ఇవ్వాలని ఆయన అనుచరులు అధిష్ఠానానికి లేఖలు రాశారు. రాష్ట్ర స్థాయి చైర్మన్ల విషయంలో కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, గుండూరుకు చెందిన సురభి వేంకటేశ్వర్‌రావుల పేర్లు కూడా ప్రధానంగా వినిపిస్తున్నాయి. కల్వకుర్తి నుంచి బీఆర్‌ఎస్‌కు చెందిన గోలి శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆయనను ఎలా కొనసాగనిస్తున్నారని కల్వకుర్తి కాంగ్రెస్ నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. కొల్లాపూర్ నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్నందున అక్కడ నామినేటెడ్ పోస్టులకు సంబంధించి ఎలాంటి పేర్లు తెరమీదకు రావడం లేదు. అచ్చంపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన వంశీకృష్ణకు పార్లమెంట్ ఎన్నికల తర్వాత అసెంబ్లీలో విప్ పదవి ఇవ్వనున్నారని ప్రచారంలో ఉంది.

పార్లమెంట్ ఎన్నికలలోపు నాగర్‌కర్నూల్ జిల్లాకు ఏదైనా కార్పొరేషన్‌కు సంబంధించి చైర్మన్ పదవి దక్కే అవకాశాలు సుహాసన్‌రెడ్డి, బాలాజీసింగ్, సురభి వేంకటేశ్వర్‌రావులకు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

జడ్చర్ల, ఫిబ్రవరి 22 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపురం గ్రామానికి చెందిన కటికె రాములు(66) కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు.. కటికె రాములు తరచుగా కడుపునొప్పితో బాధపడేవాడు. చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో ఈ నెల 21న సాయంత్రం పురుగుల మందు తాగి పడి ఉండగా, కుటుంబ సభ్యులు చికిత్స కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. కాగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతిచెందాడు. రాములు కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేరుశనగ ధరలపై ప్రభుత్వం ఆరా

- గద్వాల మార్కెట్‌ను పరిశీలించిన మార్కెటింగ్ జేడీ, అగ్రికల్చర్ ఏడీఏ



గద్వాల మార్కెట్‌లో వేరుశనగను పరిశీలిస్తున్న అధికారులు

గద్వాల, ఫిబ్రవరి 22 : వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ ధర పడిపోవడంపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఫిబ్రవరి 13వ తేదీన వేరుశనగకు ధరాఘాతంపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి ధరల తగ్గుదలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ సుధాకర్‌బాబు గురువారం గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ రాశులను, వాటి నాణ్యతను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. అదేవిధంగా కొనుగోలుదారులు, కమీషన్ ఏజెంట్లు వేస్తున్న ధరలను పరిశీలించి వారి నుంచి కూడా వివరాలు సేకరించారు. వేరుశనగ మార్కెట్‌కు వచ్చినపుడు ఉన్న ధరలు, ఆ తర్వాత పెరిగిన ధరలు, తగ్గుతూ వస్తున్న ధరల వివరాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గద్వాల వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు దారులు సరైన ధరను కోట్ చేస్తున్నారని వివరించారు. అయితే రైతులు పచ్చి వేరుశనగను మార్కెట్‌కు తరలిస్తున్నారని, ఒకటి రెండు రోజులు ఆరబెట్టి తీసుకవస్తే సరైన ధర పొందే అవకావం ఉందని వివరించారు. ఇందు కోసం వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తించారు. అదేవిధంగా రాష్ట్రంలో ధరలు తగ్గడానికి ఎగుమతులు లేకపోవడం కూడా ఒక కారణమని వారు వివరించారు. ఇప్పటికే మహబూబ్‌నగర్, బాదేపల్లి మార్కెట్‌లను కూడా పరిశీలించామని ఎగుమతులు లేకపోవడం ధరలపై ప్రభావం పడిందని వారు వివరించారు. వారి వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, మార్కెట్ సెక్రటరీ నర్సింహులు తదితరులు ఉన్నారు.

బాలిక కిడ్నాప్

- యువకుడిపై పోక్సో కేసు, రిమాండ్‌కు తరలింపు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 22 : ఓ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేయడంతో పాటు లైంగికంగా వేధించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. గద్వాల సీఐ టాటా బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక ఈ నెల 12న పరీక్షకోసం కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం తిరిగిరాకపోవడంతో బాలిక తల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గద్వాల మండలంలోని కొత్తపల్లికి చెందిన నవీన్ ఆ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి బాల్యవివాహం చేసుకున్నట్లు తెలిసింది. గురువారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలో వెళ్తుండగా అరెస్టుచేసి అతనిపై పోక్సో, కిడ్నాప్, బాల్యవివాహం చట్టం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మిర్చి ధమాల్

- పడిపోయిన ధరలు
- పెరిగిన సాగు విస్తీర్ణం
- తగ్గిన దిగుబడులు
- ముందుకురాని వ్యాపారులు
- కల్లం దాటని మిర్చి కుప్పలు
- అప్పుల పాలవుతున్న రైతులు

గతేడాది మిర్చికి డిమాండ్ ఉండడంతో రైతులు ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచారు. మంచి ధర వస్తే నాలుగు రూపాయలు మిగులుతాయని ఆశించి పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేశారు. వాతావరణం అనుకూలించక పోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. అంతేకాకుండా మార్కెట్లో ధర కూడా పడిపోవడంతో మిర్చి రైతులకు అప్పులే మిగిలేటట్లు ఉన్నది.



మానవపాడు మండలం, చెన్నిపాడు గ్రామంలో కల్లంలోనే నెలరోజులుగా నిల్వ ఉంచుకున్న మిర్చికుప్పలు

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 22 : మిర్చి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఒక వైపు దిగుబడుల్లేక మరోవైపు గిట్టుబాటు ధర లేకపోవడంతో విలవిల్లాడిపోతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 60శాతం ధరలు పడి పోయాయి. వచ్చిన ధరకైనా అమ్ముకుందామంటే వ్యాపారులు రాక పండించిన పంట కల్లం దాటడంలేదు. ఎండలు పెరగడంతో కాయ రంగుమారుతోంది. గత్యంతరం లేక కోల్ట్‌స్టోరేజీలకు తరలిస్తున్నారు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పుల మిత్తీలు మిర్చిరైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి..

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. ఇందుకు కారణం గతేడాది మిర్చి పంటకు అత్యధిక ధర పలకడమే. జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది మిర్చి 36,757ఎకరాలు సాగు చేయగా ఈ ఏడాది 65,115ఎకరాలు సాగు చేశారు. ఇందులో కౌలు రైతులే అధికంగా ఉన్నారు. ధరలు ఉంటాయన్న ఆశతో ఎకరానికి రూ. 25వేల నుంచి 50వేల దాక వెచ్చించి పంట సాగు చేశారు. అత్యధికంగా ఇటిక్యాల మండలంలో 16వేల ఎకరాలు, అత్యల్పంగా కేటీదొడ్డి మండలంలో 400 వందల ఎకరాలు సాగుచేశారు. జిల్లాల్లో అత్యధికంగా గుంటూరు మిర్చి, 2043 బ్యాడిగి, డబ్బీ బ్యాడిగి, ఆర్మూర్, తేజ మొదలగు రకాలు సాగు చేశారు. 2043 బ్యాడిగీ రకం ఎకరాకు 10 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడివస్తుంది. డబ్బీబ్యాడిగీ ఎకరాకు 7నుంచి 15 క్వింటాళ్లు, గుంటూరు రకం 10 నుంచి 30 వరకు దిగుబడివస్తుంది. ఈ ఏడాది వర్షభావా పరిస్థితుల వల్ల దిగుబడి గణనీయంగా తగ్గి ఎకరానికి 3 నుంచి 12 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. వీటిలో అధిక డిమాండ్ ఉన్న రకం 2043, డబ్బీ బ్యాడిగీ రకాలు మార్కెట్లో మంచి డిమాండ్‌ను కలిగి ఉంటాయి. ధర 2043 రకం గతేడాది క్వింటాలుకు సుమారు రూ.55 వేల వరకు పలికింది. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా రూ.12 వేల నుంచి రూ.18 వేలు మాత్రమే పలుకుతోంది. గుంటూరు రకం రూ.12 నుంచి రూ.16వేలు, ఆర్మూర్ రకం రూ. 9 నుంచి రూ.14వేలు, తేజ రూ.16నుంచి రూ.18వేల వరకు బహిరంగా మార్కెట్లో ధర పలుకుతోంది. డబ్బీ బ్యాడిగీ మాత్రమే రూ. 30నుంచి రూ.42వేలు పలుకుతోంది. కానీ డబ్బీ బ్యాడిగా ఎకరానికి కేవలం 2నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని రైతులు వాపోతున్నారు.

పెరిగిన పెట్టుబడి..

మిర్చిసాగు చేయాలంటే రైతు తప్పనిసరిగా అప్పు చేయాల్సిందే.. అయిదేళ్ల క్రితం వరకు ఎకరా సాగు ఖర్చు రూ.70వేలు అయ్యేది. ఆ ఖర్చు మూడేళ్లుగా డబుల్ అయింది. మిర్చిసాగు చేయాలంటే కనీసం ఎకరానికి రూ. 1 లక్ష నుంచి రూ.1.5లక్ష దాక పెట్టుబడి అవుతోందని రైతులు వాపోతున్నారు. అందుకు తగినట్లు దిగుబడి, ధరలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది 90శాతం మంది రైతులు సాగుకు అప్పులు చేశారు. కానీ దిగుబడి తగ్గడం, ధరలు తగ్గడంతో పెట్టుబడి కూడా తీయలేని పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షభావ పరిస్థితుల వల్ల మిర్చిపంట రెండునెలలు ముందే కోతకొచ్చింది. ఇప్పటికే 70శాతం మంది రైతులు తమ పంటను కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ధరలు పడిపోవడంతో వ్యాపారులు కూడా రావడంలేదు. దీంతో కల్లాల్లో ఉన్న మిర్చిని అమ్ముకోవాలా.. కూల్ట్ స్టోరేజీలలో దాచాల అన్న సందిగ్ధంతో రైతులు సతమతం అవుతున్నారు.

దిగుబడి రాలేదు..



2043బ్యాడిగీ రకం మిర్చిని నాలుగు ఎకరాల్లో సాగు చేశాను. దిగుబడి 40 క్వింటాళ్లు రావాల్సింది కేవలం 6 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దీనికి తోడు ధర పడిపోయింది. వచ్చినకాడికి అమ్ముకుందామన్నా వ్యాపారులు రావడంలేదు. వచ్చిన ఒకరిద్దరు కూడా తక్కువ ధరకు అడుగుతుండటంతో ఎటు తేల్చుకోలేకపోతున్నాం. పైగా గ్రామాల్లోకి వచ్చే దళారులు సంచికి రెండు కిలోలు తరుగు తీస్తున్నారు.

- రాజు, శేరువల్లి గ్రామం, ఉండవల్లి

అప్పుచేసి సాగుచేశా..



గతేడాది అధిక ధర పలకడంతో అప్పు చేసి ఆరు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. పంట మొదటి నుంచే తెగుళ్ల దాడితో పంటపూర్తిగా నష్టపోయాను. 40 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి కేవలం ఆరు క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. పంట అమ్మితే సాగుకోసం చేసిన అప్పు మిత్తికి కుడా ఎల్లలేదు.

- మాలరాజు, చెన్నిపాడు గ్రామం, మానవపాడు

గోదాములు నిండిపోయాయి



గతేడాది ధరలను చూసి ఈ ఏడాది మిర్చిని అత్యధికంగా సాగు చేశారు. గతేడాది కొనుగోలు చేసిన విదేశీ వ్యాపారులు పంటను నిల్వ ఉంచుకున్నారు. అదే సమయంలో చాలామంది రైతులు ధరలు ఇంకా పెరుగుతాయన్న కారణంగా గోదాముల్లో నిల్వఉంచుకున్నారు. ఈ ఏడాది ధరలు పడిపోవడంతో రైతులు తమ సరకును గోదాములకు తరలిస్తున్నారు. పాత సరకు ఉండగానే కొత్త సరకు రావడంతో గుంటూరులో 70 శాతం గోదాముల వద్ద ఫుల్ బోర్డు పెట్టారు.

-ఎస్‌కే హమీద్, మిర్చి ట్రేడర్, అలంపూర్ చౌరస్తా



ఎక్కువ రోజులు నిల్వ ఉండటం, తీవ్రమైన ఎండల కారణంగా రంగు మారుతుండటంతో మిర్చి కుప్పపై జమ్ముగడ్డిని కప్పిన రైతులు

రాజుకుంటున్న రాజకీయ చిచ్చు

- గిరిజన బిడ్డను కాబట్టే నాపై కక్ష సాధింపు
- ఎంపీపీ భోజ్యానాయక్ ఆవేదన
- పదవికి రాజీనామా చేస్తూ కలెక్టర్‌కు లేఖ



ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తూ కలెక్టర్‌కు లేఖ రాస్తున్న భోజ్యానాయక్

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన మూడు నెలల్లోపే కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ చిచ్చు మొదలైంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎంపీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన భోజ్యానాయక్‌పై ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ సందర్భంగా గురువారం కొల్లాపూర్ ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ భోజ్యానాయక్ విలేకర్ల సమావేశం నిర్వహించి బాహాటంగానే మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. గతంలో తనకన్న ముందు ఎంపీపీగా ఉన్న వ్యక్తిని మహిళ అని చూడకుండా ఇబ్బందుల పాలు చేసి ఆమెతో పదవికి రాజీనామా చేయించారని అన్నారు. వైస్ ఎంపీపీగా ఉన్న తనకు ఎంపీపీగా అవకాశం కల్పించి మానసికంగా వేధిస్తున్నందుకే తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. దీంతో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తనపై కక్ష సాధింపు చర్యగా ఎంపీటీసీ సభ్యులతో అవిశ్వాస తీర్మానం పెట్టి తనను పదవి నుంచి తొలగించాలని కుట్ర చేస్తున్నట్లు భోజ్యానాయక్ వాపోయారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో వార్డుమెంబర్‌గా కూడా గెలవలేడని, ఆయనది భూకబ్జాల చరిత్ర అని ఆరోపించారు.

తన వ్యక్తిగత కారణాలతో కొల్లాపూర్ మండల పరిషత్ అధ్యక్ష పదవికి(ఎంపీపీ) రాజీనామా చేస్తున్నానని, తన రాజీనామా లేఖను అంగీకరించాలని కోరుతూ కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌కు ఎంపీపీ భోజ్యానాయక్ లేఖ రాశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు హనుమంతునాయక్, యన్మన్‌బెట్ల మాజీ సర్పంచ్ మేకల నాగరాజు, గిరిజన సంఘం నాయకులు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది హెక్టార్ల అడవి దగ్ధం

- నల్లమలలో మంటలను అదుపు చేసిన వాచర్లు



వేములపాయ వద్ద మంటలను ఆర్పుతున్న వాచర్లు

మన్ననూర్, ఫిబ్రవరి 22: అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతం(ఏటీఆర్)లో ఎక్కడో ఒక చోట కార్చిచ్చు రగులుతూ అటవీశాఖ అధికారులను కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. బుధవారం సాయంత్రం రాంపూర్ పెంటలో ఏర్పడిన మంటలు వేములపాయ, భౌరాపూర్ అడవి వరకు వ్యాపించాయి. అంతర్జాలంలో సమాచారాన్ని అందుకున్న అటవీ రేంజ్ అధికారి ఈశ్వర్ నేతృత్వంలో పుల్లాయపల్లి సెక్షన్ నుంచి 15 మంది ఫైర్ వాచర్లు, బీట్ అధికారులు మంటలు ఏర్పడిన ప్రాంతాలకు వెళ్లి బుధవారం అర్ధరాత్రి దాకా బ్లోజర్ల సహాయంతో శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే మొత్తం ఎనిమిది హెక్టార్ల అడవి అగ్నికి ఆహుతైందని రేంజ్ అధికారి ఈశ్వర్ తెలిపారు. అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం గాని, బీడీ సిగరేట్ కాల్చి పారేయడం, ఎండు గడ్డి రాపిడి జరుగుతూ ఉండడం వల్లనే మంటలు అంటుకుంటున్నాయని, ఎక్కడ మంటలు వచ్చినా సమీప గ్రామాల ప్రజలు అటవీ అధికారులకు సమాచారం అందించాలని రేంజ్ అధికారి స్థానికులకు విజ్ఞప్తి చేశారు.

ఇసుక ఫిల్టర్ల ధ్వంసం

హన్వాడ, ఫిబ్రవరి 22 : మండలంలోని బుద్దారం, కారంతండా గ్రామాలలో ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్న ఫిల్టర్లను గురువారం తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎస్‌ఐ వెంకటేష్‌లు ధ్వంసం చేశారు. ఇలాంటి తయారు దారులను గుర్తించి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడ కూడా ఇసుక ఫిల్టర్లు ఉంటే వాటిని గుర్తించి, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు



శిగాలూగుతున్న వనం



చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు



సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు



- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

సమ్మక్క గద్దె

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.



క్యూలైన్లలో భక్తుల రద్దీ



ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం వేముల రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలలో
పాలమూరు మూడో స్థానం



క్రీడాకారులను సన్మానిస్తున్న కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 22 : రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలలో జిల్లా జట్టు మూడో స్థానంలో నిలవగా, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సూర్యాపేట జిల్లా చింతపాలెంలోని మల్లారెడ్డి గూడలో ఈ నెల 16 నుంచి 19 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 33 జిల్లాల జట్లు పాల్గొన్నారు. ఈ టోర్నీలో పాలమూరు జిల్లా జట్టు ప్రతిభ కనబర్చింది. సెమీ ఫైనల్‌లో తలపడి మూడోస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురువారం జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్‌లు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు నిరంతర సాధన చేస్తూ భవిష్యత్తులో మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. కబడ్డీలో పాలమూరు క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ ఉపాధ్యక్షులు కేబీ రాములు, కార్యనిర్వాహక కార్యదర్శి ఉంద్యాల రాజవర్ధన్‌రెడ్డి, కోచ్ మల్లేష్, గణేష్ పాల్గొన్నారు.

56 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఆత్మకూరు, ఫిబ్రవరి 22 : వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో 56 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన వెంకటన్న రేషన్ బియ్యాన్ని గ్రామాల నుంచి సేకరించి డంప్ చేశాడు. గురువారం తెల్లవారుజామున బియ్యాన్ని రాయచూర్ జిల్లాకు తరలించేందుకు సిద్ధమయ్యాడు. తమకందిన విశ్వసనీయ సమాచారంతో మినీ డీసీఎంలో బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం విలువ రూ.లక్షా 15 వేలు ఉందన్నారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చామని, వారి ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీవోకు గాయాలు

ఎర్రవల్లి, ఫిబ్రవరి 22 : ఇటిక్యాల ఎంపీవో భాస్కర్, పెద్దదిన్నె పంచాయతీ కార్యదర్శి శివన్నలు గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. వారిద్దరూ ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎర్రవల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఎర్రవల్లి ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. వారిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ పరామర్శించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 22 : భార్యాభర్తల మధ్య జరిగిన చిన్న గొడవతో మనస్పర్థానికి గురైన ఓ భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందిందని ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బడుగుల అనిత (33) తన భర్త సత్యంతో కుటుంబ విషయంలో ఈ నెల 20న గొడవ పడింది. తల్లి ఈదమ్మ వచ్చి ఇరువురికి నచ్చ చెప్పి మంచిగా ఉండాలని సూచించింది. ఆ మరుసటి రోజు 21న రాత్రి 9 గంటల సమయంలో బాత్‌రూంలోకి వెళ్లి పురుగుల మందుతాగి బాత్‌రూంలో కొట్టుమిట్టాడుతుండగా గమనించిన కుటుంబ సభ్యులు, వెంటనే 108లో చికిత్సం కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

'భారత్‌మాల' పనులను అడ్డుకుంటాం

- రాజోలి గ్రామస్థుల ఆందోళన

రాజోలి, ఫిబ్రవరి 22 : రాజోలి నుంచి వడ్డేపల్లికి వెళ్లే దారిలో నిర్మిస్తున్న వంతెన ఎత్తును పెంచే వరకు భారతమాల రహదారి నిర్మాణ పనులను అడ్డుకుంటామని రాజోలి గ్రామస్థులు స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం వారు పనులను అడ్డుకొని ఆందోళన చేపట్టారు. భారత్‌మాల పనుల్లో భాగంగా రాజోలి ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న వంతెన ఎత్తు పెంచాలని, అప్పటివరకు పనులను నిలిపివేయాలని సంబంధిత అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను కలిపే ఈ రహదారి మీదుగా పత్తి, మిరప, వరి, సుబాబుల్, చెరకు, తదితర వ్యవసాయ ఉత్పత్తులను రైతులు లారీల్లో తీసుకెళ్తుంటారని తెలిపారు. దారిలోని వంతెనను తక్కువ ఎత్తులో నిర్మించడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. ఈ సందర్భంగా డీజీఎం జనార్దన్, డీపీఎం రవి చంద్రకాంత్ మాట్లాడుతూ వంతెన ఎత్తు పెంచడం తమ పరిధిలో లేదని తెలిపారు. ఈ విషయాన్ని ఇంతకుముందే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పనులను నిలిపేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రాజోలి మాజీ ఉప సర్పంచు గోపాల్, కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్ కుమార్, గ్రామ పెద్దలు గోవర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.



భారత్ మాల బ్రిడ్జి పనులను అడ్డుకుంటున్న రాజోలి గ్రామస్థులు

డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ బృందం

జడ్చర్ల, ఫిబ్రవరి 22 : జడ్చర్లలోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు పర్యటించిన న్యాక్ బృందంలోని సభ్యుడు అస్సాం రాష్ట్రం జోర్హాట్ జెబి కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బిమల్‌బరాహ్ గురువారం కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడారు. న్యాక్‌బృందం చైర్మన్‌గా కర్ణాటక రాష్ట్రం హసన్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ టీసీ తారానాథ్, కోఆర్డినేటర్ సభ్యుడిగా తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె. జయచంద్రారెడ్డి, సభ్యుడిగా అస్సాం రాష్ట్రం జోర్హాట్ జేబీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బిమల్‌బరాహ్‌లు కళాశాలకు వచ్చిన విషయం పాఠకులకు విదితమే. రెండు రోజుల పర్యటనలో భాగంగా బొటానికల్ గార్డెన్, కొత్తకేశవులు గ్రీన్‌నెట్ హౌజ్‌లను పరిశీలించారు. అనంతరం బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను సందర్శించి, సెంటర్‌లో జరుగుతున్న పరిశోధనలను పరిశీలించారు. కళాశాలలోని రికార్డులు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం రెండు రోజుల పర్యటనను ముగించుకుని వెళ్లారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడుతున్న న్యాక్ బృందంలోని సభ్యుడు డాక్టర్ బిమల్‌రాహ్

అప్పు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

- నిర్బంధించిన ఆలయంలోనే బలవన్మరణం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన
- మృతుడు సీఎం రేవంత్‌కు దూరపు బంధువు

వంగూరు, ఫిబ్రవరి 22: తాను తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించలేక ఓ వ్యక్తి తనను నిర్బంధించిన దేవాలయంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎనుముల గురువారెడ్డి (75) కల్వకుర్తికి చెందిన పాండుగౌడ్, జకినాలపల్లికి చెందిన మంత్రునాయక్‌కు తనకున్న 28 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసి, మళ్లీ చెల్లిస్తానని రూ.6 లక్షలు తీసుకున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే గురువారెడ్డి అదే గ్రామానికి చెందిన కాయితి పార్వతమ్మకు చెందిన రెండెకరాల భూమిని కూడా గత ఏడాది పాండుగౌడ్, మంత్రునాయక్‌కు రిజిస్ట్రేషన్ చేయించి, ఆమెకు రూ.2 లక్షలు ఇప్పించాడు. ఆమె తాను తీసుకున్న డబ్బు తిరిగి చెల్లిస్తానని, తన భూమిని తనపేర రిజిస్ట్రేషన్ చేయించాలని పాండుగౌడ్, మంత్రునాయక్‌ను కోరింది. కానీ, వారు గురువారెడ్డి కూడా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని మెలిక పెట్టారు. దాంతో ఆమె ఆరు నెలలుగా గురువారెడ్డి చుట్టూ తిరుగు తోంది. వారు కూడా గురువారెడ్డిని డబ్బుల కోసం గట్టిగా మందలించారు. ఈ నెల 19న భూమి రిజిస్ట్రేషన్ కోసం పార్వతమ్మ స్లాట్ బుక్ చేసుకుంది. ఈ క్రమంలో సమస్య పరిష్కారం కోసం బుధవారం సాయంత్రం గురువారెడ్డిని తీసుకుని వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఇది సివిల్ మ్యాటర్ అని, మీరే మాట్లాడుకోండని పోలీసులు చెప్పడంతో తిరిగి గ్రామానికి వచ్చా రు. బ్రహ్మంగారి ఆలయంలో గురువారెడ్డిని ని ర్బంధించి తాళం వేశారు. అక్కడ పార్వతమ్మ, ఆమె మనుమడు తేజ కాపలా ఉన్నారు. గురు వారం తెల్లవారుజామున 4.30 గంటలకు మైక్ పెట్టడానికి వీరోజీ అనే వ్యక్తి ఆలయం వద్దకు వచ్చాడు. గ్రామానికి చెందిన బాలీశ్వర్ రమ్మని చెప్పాలని గురువారెడ్డి వీరోజీని కోరాడు. వీరోజీ చెప్పడంతో వచ్చిన బాలీశ్వర్ లోపలికి వెళ్లి చూడగా కిటికీ పైఊచలకు ఆలయంలో ఉన్న శాలువాతో గురువారెడ్డి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. పార్వతమ్మ ఆలయానికి కొద్ది దూరంలో చలిమంట వేసుకుని ఉంది. గురువారెడ్డి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి ఆమె తన మనుమడితో కలిసి ఇంటికి వెళ్లిపోయింది. గురువారెడ్డి భార్య 12 సంవత్సరాల క్రితమే చనిపోయింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ మహేందర్ సంఘటనా స్థలానికి వచ్చి గురువారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. అతని ఇంట్లో సూసైడ్ నోట్ దొరికింది. కొంతకాలంగా పాండుగౌడ్, మంత్రునాయక్‌ల ఒత్తిడిని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని గురువారెడ్డి ముందుగానే నిర్ణయించుకుంటాడని భావిస్తున్నారు. పాండుగౌడ్, మంత్రునాయక్ వేధింపుల వల్లే తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నట్లు గురువారెడ్డి కుమారుడు సుధీష్ రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గురువారెడ్డి, పార్వతమ్మ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దూరపు బంధువులు కావడం గమనార్హం.



గురువారెడ్డి (ఫైల్)

వృద్ధుడి అదృశ్యం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 22 : ఇంటి నుంచి రెండు రోజుల క్రితం వెళ్లిన ఓ వృద్ధుడు తిరిగి రాకపోవడంతో గురువారం కుటుంబ సభ్యు లు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ అభిషేక్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జంగమయ్య పల్లి గ్రామానికి చెందిన సంగెం రాములు రెండు రోజుల క్రితం ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి నేటికీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన ఆయన కుమారు మల్లేష్ తన తండ్రి ఆచూకీ కనిపెట్టాలం టూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గట్టు, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి శివారులోని వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన పాలెం ఈరన్న ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో కానిస్టేబుల్ నర్సింహులు, కృష్ణయ్య వాగు దగ్గర బాటలో తనిఖీలు చేయగా ట్రాక్టర్ పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఒకే కాన్పులో నాలుగు మేక పిల్లల జననం



నాలుగు మేక పిల్లలను చూపిస్తున్న కాపరి దొడ్డి బీరయ్య

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 22 : ఒకే కాన్పులో నాలుగు మేక పిల్లలు జన్మించాయి. మండల కేంద్రంలో దొడ్డి బీరయ్య అనే గొర్రెల కాపరికి మేకలున్నాయి. అందులో భాగంగా గురువారం ఒక మేక నాలుగు మేక పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో రెండు ఆడ మేక పిల్లలు, రెండు మగ మేక పిల్లలు ఉన్నాయని, నాలుగు మేక పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నాయని గొర్రెల కాపరి పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి వివాహితుల అదృశ్యం

జడ్చర్ల, ఫిబ్రవరి 22 : జడ్చర్ల పట్టణంలో వేర్వేరుగా ఇద్దరు వివాహితలు అదృశ్యమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. మునిసిపాలిటీలోని ఓ కాలనీకి చెందిన వివాహిత కనిపించడంలేదంటూ ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఈ నెల 19న రాత్రి 8గంటల నుంచి కనిపించకుండా వెళ్లిందని, ఆచూకీ కోసం పరిసర ప్రాంతంలో వెదికినా ఫలితం లేకపోవడంతో గురువారం ఫిర్యాదు చేసాడని, ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో ఘటనలో పట్టణంలోని ఓ కాలనికి చెందిన తన కూతురు కనిపించడం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సోదరుడి వివాహం కోసమని నెల రోజు ముందు తల్లిగారింటికి వచ్చిన ఆమె అనారోగ్యం కారణంగా అత్తగారింటికి వెళ్లకుండా పుట్టింట్లోనే ఉంది. ఈ నెల 21న రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం నిద్రించిన వారంతా, గురువారం ఉదయం ఆరు గంటలకు చూడగా సదరు మహిళ కనిపించలేదని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొ న్నట్లుగా ఎస్ఐ తెలిపారు.

వ్యాసరచన పోటీలు నిర్వహించాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్, సైబర్ పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 24న 8,9వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న 8,9వ తరగతి విద్యార్థులకు రాత్రికి రాత్రే మిలినియర్‌గా మారితే ఆ డబ్బులను ఎలా వినియోగిస్తారనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి అత్యుత్తమమైన వ్యాసరచన, స్లోగన్స్, పోస్టర్‌ను ఎంపిక చేసి అదే రోజు సాయంత్రం 5గంటలలోగా జిల్లా విద్యాధికారి కార్యాలయ జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డికి అందజేయాలని కలెక్టర్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ప్రకటనలో ఆదేశించారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభించిన ఎస్పీ వైభవ్ గైక్వాడ్



పోటీలను తిలకిస్తున్న ఎస్పీ వైభవ్ గైక్వాడ్, వ్యవసాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ

బిజినేపల్లి, ఫిబ్రవరి 22 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్ స్పోర్ట్స్, గేమ్స్, కల్చరల్ అండ్ లిటరరీ మీట్ 2.23-24 ను పాలెం వ్యవసాయ కళాశాల ఆవరణలో ఎస్పీ వైభవ్ గైక్వాడ్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణలు గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జోన్లకు చెందిన నాన్ టీచింగ్ స్టాఫ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చినందుకు అభినందించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలను ఎస్పీ గైక్వాడ్ మొదటగా క్రికెట్‌లో బ్యాటింగ్ చేసి ప్రారంభించి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.పుష్పావతి, యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ సురేష్, పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

'ఎంత సమయం పని చేస్తే అన్ని డబ్బులు వస్తాయి'

తాడూరు, ఫిబ్రవరి 22 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలు ఎంత ఎక్కువ సమయం పని చేస్తే అంత ఎక్కువ డబ్బులు వస్తాయని డీఆర్‌డీవో ఓబులేష్ అన్నారు. గురువారం మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడుతూ ఎక్కువ సమయం పని చేసి మేజర్‌మెంట్ ప్రకారం ఎక్కువ కలిగి ఉన్నట్లయితే అంత ఎక్కువ డబ్బులు కూలీలకు అందుతాయని సూచించారు. ఏదో నామమాత్రంగా పనికి హాజరై డబ్బులు తక్కువగా వస్తున్నాయనడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీలో పని చేసే కూలీలందరూ ఎక్కువ సమయం పని చేసి ఎక్కువ డబ్బులు పొందే విధంగా చూడాలని సూచించారు. మొక్కల ఎదుగుదలపై అవగాహన కల్పించారు. రానున్న రెండు మూడు నెలల్లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతున్నందున మొక్కలు నాటాల్సిన ప్రదేశాలను ఎంపిక చేయడంతోపాటు నర్సరీల్లో ఆరోగ్యవంతమైన మొక్కలు పెంచేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఏపీవో ప్రవీణ్‌కుమార్, ఏపీఎం శేఖర్, చంద్రసిద్దార్థ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమష్టి కృషి



జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న జర్నలిస్టులు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పత్రికలు ప్రజలు, ప్రభుత్వానికి వారధి లాంటివని.. సమష్టిగా కృషి చేసి జిల్లా అభివృద్ధి కోసం శ్రమిద్దామని జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సంబంధిత కార్యాలయంలో జర్నలిస్టులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు, జర్నలిస్టుల మధ్య సమన్వయం కుదుర్చి సహృద్భావ వాతావరణాన్ని కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

సీనియర్ జర్నలిస్టులు అబ్దుల్లాఖాన్, చారి, జెమిని సురేష్, శివశంకర్, మాధవరెడ్డి, కందికొండ మోహన్, దస్తగిరి, ఏటిగడ్డ వెంకటేష్, సందు యాదగిరి, సీనుబాబు, రజిత్‌కుమార్, శ్రీను, మాధవరెడ్డి, డీపీఆర్‌వో కార్యాలయ సిబ్బంది పాషా, అనసూయ, యాదగిరి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధితులు భయపడకుండా ధైర్యంగా ముందుకు రావాలి

బిజినేపల్లి, ఫిబ్రవరి 22 : అన్యాయాలకు గురైన బాధిత మహిళలు, బాలికలు భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై సీహెచ్ రామేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం షీటీం, పోక్సో టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు గురైతే జిల్లా షీటీం మొబైల్ నంబర్ 8712657676 లేదా డయల్ 100ను సంప్రదించాలని సూచించారు. బిజినేపల్లి ఎస్సై నాగశేఖర్ రెడ్డి, షీటీం జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మి, మెంటర్ వెంకటయ్య, జీహెచ్‌ఎం శ్రీదేవి, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ యశ్వంత్, కవిత, విద్యార్థులు ఉన్నారు.

ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఆందోళన



ప్రత్యేక అధికారి భాస్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భూనిర్వాసితులు

బల్మూర్, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని మైలారం, గోరంట్లబండ ప్రాంతంలో శ్రీఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణం కోసం అధికారులు తరచూ వస్తుండడంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టవద్దని గురువారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఎంపీడీవో భాస్కర్‌కు భూనిర్వాసితులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సమన్వయ నాయకులు సీతారాంరెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వేలు నిర్వహించారని, ప్రస్తుతం నీటి శాఖ అధికారులు ఈ ప్రాంతంలో హద్దులను పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రాజెక్టు నిర్మిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కులాల భూములు కోల్పోయి పేదరికం అనుభవించాల్సి వస్తుందని, ప్రభుత్వం చేసే ప్రయత్నాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సర్వేలు నిర్వహించారని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏకంగా రైతులకు సమాచారం ఇవ్వకుండానే అధికారులు రావడం ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టవద్దని కాల్వల ద్వారా నీరందిస్తే సరిపోతుందని వారన్నారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని ప్రత్యేక అధికారి ఎంపీడీవో భాస్కర్‌ను రైతులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రైతులు వెంకటస్వామి, శ్రీను, బాలస్వామి, కృష్ణయ్య, భాస్కర్‌తో పాటు మహిళా రైతులు పాల్గొన్నారు.

ఫార్మసీలోని మందుల నిర్ధారణ జరిగితే చర్యలు

- శశి హాస్పిటల్‌ను తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 22 : కాలం చెల్లిన మందులు పంపిణీ చేసినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ గురువారం తెలిపారు. కాలం చెల్లిన మందులతో రోగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటన జిల్లా కేంద్రంలో శశి ఆర్థో హాస్పిటల్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనపై రోగి బంధువులు ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ గురువారం సాయంత్రం ఆసుపత్రిలోని మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలు తెలుసుకుని నిర్ధారణ జరిగితే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుదాం

- అచ్చంపేటకు ఇంజనీరింగ్ కాలేజీ తెస్తా...

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



మునిసిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 22: అచ్చంపేట మునిసిపాలిటీని అన్ని రంగాలలో మోడల్ మునిసిపాలిటీగా తయారు చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరపు మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశం మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కమిషనర్ శ్యాంసుందర్ అధ్యక్షతన గురువారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ మునిసిపాలిటీలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఎలాంటి వారినైన వదిలేది లేదన్నారు. అలాంటి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న ట్యాక్స్‌లను కట్టేందుకు పట్టణవాసులు, వ్యాపారస్తులు ముందుకు రావాలన్నారు. అధిక మొత్తం ట్యాక్స్‌లు ఉన్న వారికి రాయితీ వసతి కల్పించాలన్నారు. నాతో పాటు ప్రజాప్రతినిధులు అందురూ ట్యాక్స్‌లు చెల్లించాలని మాతోనే మొదలు పెట్టి పట్టణ అభివృద్ధికి అందరం తోడ్పడుదామన్నారు. రాబోవు రోజుల్లో అచ్చంపేట మునిసిపాలిటీని జిల్లాలో మొదటి స్థానంలో నిలబెడదామన్నారు. ప్రధానంగా అచ్చంపేటలో ఉన్న సమస్యలు డ్రైనేజీలు, మల్లంకుంట అభివృద్ధి, లైటింగ్స్, మంచినీటి సమస్యపై ప్రధానంగా సమావేశంలో చర్చించారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న పనులు, ఇంకా ప్రారంభం కాని పనులపై ఏఈలు ప్రత్యేక దృష్టి సారించి వాటి నివేదికలు రెండు రోజుల్లో తమకు ఇవ్వాలన్నారు. గతంలో చేసిన తప్పిదాలను మళ్లీ చేయవద్దన్నారు. అచ్చంపేటకు ఇంజనీరింగ్ కాలేజి తెస్తానని, సీతరాలగుట్టలోని 12ఎకరాలలో కాలేజి నిర్మాణం చేయడమే నా కల.. ఎంత కష్టమైనా నేను తెస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా అచ్చంపేటలో అతిపెద్ద పార్కింగ్ ఏర్పాటు చేసి మహేంద్రనాథ్ పేరుతో పార్క్, విగ్రహం ఏర్పాటు చేస్తానన్నారు. గత కొన్ని రోజుల క్రితమే రూ 20 కోట్ల పనులు ఎన్టీఆర్ స్టేడియం పెండింగ్ పనులతో పాటు ప్రధాన డ్రైనేజీలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ నుంచి అచ్చంపేట మునిసిపాలిటీలో నూతన విధానాన్ని అమలు చేసి అచ్చంపేటను నూతన అచ్చంపేటగా మార్చుకుందామన్నారు. కౌన్సిలర్లు గౌరీశంకర్, సునీత, శివ, అంతటి శివ, రమేష్ రావు, మను పటేల్, సిబ్బంది తిరుపతయ్య అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి రుణాలు అందించాలి

- అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 22: నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులందరికి బ్యాంకర్లు రుణాలను అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించి జిల్లాలోని వివిధ బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి బ్యాంకుల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంట రుణాలతో పాటు టర్మ్ లోన్లు, వ్యవసాయ అనుబంధ రుణాలు అందించాలన్నారు. అలాగే యువతకు విద్యా ఉపాధి అవకాశాల కోసం రుణ సదుపాయం కల్పించాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చిన్న, సూక్ష్మ పరిశ్రమల స్థాపన కోసం బ్యాంకర్లు రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించాలన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి బ్యాంకర్లు బెనిఫిషరీ మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగించాలని బ్యాంకర్లకు సూచించారు. వ్యయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ చేయడంతో పాటు సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయొద్దని ఆదేశించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



పెంట్లవెల్లిలో వేంకటేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని పురాతన ఆలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అలువేలుమంగ సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదటగా స్వామి వారికి కలశ స్థాపన, ధ్వజారోహణం, బలిహరణం, బేరీపూజా, దేవతాఆహ్వానం, అనంతరం ఉదయం 11:45 గంటలకు అలువేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదానంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా శుక్రవారం దేవతా పూజలు, నవగ్రహ హోమం, స్వామి సేవ, శనివారం శ్రీవారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పాల్గొననున్నారు.

దేవునితిర్మలాపూర్‌లో వెంకన్న బ్రహ్మోత్సవాలు

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండుగగా కొనసాగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామిని గరుడ వాహనంపై అలంకరించి గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శేషాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ వి.సత్యం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి



ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఇంటర్ విద్య నోడల్ అధికారి వెంకటరమణ

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 22: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో తన వంతు కృషి చేస్తానన్నారు. ఉన్నత విద్యకు కీలమైన ఇంటర్ పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా ప్రణాళికతో విద్యార్థులు చదవాలన్నారు. విద్యార్థులకు ప్రిపరేషన్‌కు అధ్యాపకులు సహకరించి రాష్ట్ర స్థాయిలో కళాశాలకు గుర్తింపే లక్ష్యంగా పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

తెలకపల్లి: మండల పరిధిలోని పెద్దపల్లిలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ నెల 14 నుంచి పెద్దపల్లిలోని బుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి కాకుండా మండలంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా బండలాగుడు పోటీలు తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు ఇచ్చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం కమనీయం

- రామగిరి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న బ్రాహ్మణులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 22: కల్వకుర్తి మండలం రఘుపతిపేట, రామగిరి సీతారామచంద్రస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. వేద మంత్రోచ్ఛారణల మధ్య సాగిన కల్యాణోత్సవానికి కల్వకుర్తి నాగర్‌కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలు హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ప్రతీ ఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని కోరారు. రామగిరి సీతారామచంద్రస్వామి దేవాలయాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను ఆలయ పూజారులు పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, సీహెచ్ సతీష్‌కుమార్, సంజీవ్‌యాదవ్, మాజీ సర్పంచ్ రేణుక, రఘుపతిపేట గ్రామ నాయకులు, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేలం ఆదాయం రూ.9 లక్షలు

వెల్దండ, ఫిబ్రవరి 22 : గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివ రాత్రి సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, ఇతరములకు నిర్వహించిన వేలంపాటలో వ్యాపారులు రూ. 9 లక్షలకు టెండర్లు దక్కించుకున్నారు. టెంకాయలకు రూ.3.50 లక్షలు, లడ్డూ, పులిహోరకు 30,600, కొబ్బరి చిప్పలకు 21,600లకు వ్యాపారులు దక్కించుకున్నారు. అదేవిధంగా ఏడాదికిగాను టెంకాయలను రూ.1.32 లక్షలు, లడ్డూ, పులిహోరకు లక్షా 5 వేలకు వ్యాపారులు దక్కించుకున్నారు. ఈవో ప్రసాద్, నాయకులు పర్వత్‌రెడ్డి, అరుణ్‌కుమార్, బాలస్వామి, కృష్ణయ్య, నరహరి, సురేష్ ఉన్నారు.

'ఢిల్లీలో రైతులపై దాడులు ఆపాలి'

కల్వకుర్తి, ఫిబ్రవరి 22 : రైతుల సమస్యలను పరిష్కరించాలని ఢిల్లీలో ఉద్యమం చేస్తున్న రైతులపై దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ కల్వకుర్తి తాలుకా రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో ఎస్.శ్రీనుకు గురువారం వినతి పత్రం అందజేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కల్వకుర్తి నియోజకవర్గ రైతు సేవా సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

తాడూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని గోవిందాయపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రధానోపాధ్యాయులుగా కీర్తి, ఎంఈవోగా జీవిత, డీఈవోగా అర్జున్, కలెక్టర్‌గా రజితతోపాటు మరో 20మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చాంద్‌పాషా, హెచ్‌ఎం.వెంకట్రామిరెడ్డి, సీఆర్‌పీ మల్లారెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండ్ర పీఎస్‌లో..

కల్వకుర్తి: కల్వకుర్తి మండల పరిధిలోని తాండ్రా ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు చక్కటి వేషధారణలో ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబ్యాసం గావించారు. స్వయం పరిపాలనలో హెచ్‌ఎంగా జశ్వంత్, ఎంఈవోగా ఎండి.నవాజ్‌లతోపాటు 30మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారారు. బోధనలో ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వి.జంగయ్యలు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, శివకుమార్, పావని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యా ప్రదాత శశికాంత్ వాల్మీకికి సన్మానం



కొల్లాపూర్‌లో విద్యా ప్రదాత శశికాంత్‌వాల్మీకిని సన్మానిస్తున్న బోయ వాల్మీకి సంఘం నాయకులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే కాకుండా అతి తక్కువ కాలంలోనే వారికి ఉద్యోగ అవకాశాలు దక్కేలా కృషి చేస్తున్న విద్యా ప్రదాత శశికాంత్‌వాల్మీకిని గురువారం కొల్లాపూర్‌లో బోయ వాల్మీకి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఎంజీఎల్ఐ అతిథి గృహ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వాల్మీకి సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణమనాయుడు, సింగోటం మాజీ సర్పంచ్ మండ్ల కృష్ణయ్య వాల్మీకి సంఘాల నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు ప్రతాప్‌నాయుడు, వెంకటేష్‌నాయుడులు శశికాంత్‌వాల్మీకిని శాలువా, పూల మాలలతో సత్కరించారు. వాల్మీకి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మీనుగ పరుశరామ్‌నాయుడు, జిల్లా నాయకులు ధర్మయ్య, సీపీనాయుడు, పురుషోత్తంనాయుడు, గోవర్ధన్‌నాయుడు, శివ, చింటు, పవన్, గోపాల్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణపై రైతులకు అవగాహన

తెలకపల్లి, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని చిన్నముద్దునూర్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం పాలెం వ్యవసాయ రావేఫ్ విద్యార్థులు గురువారం గ్రామ రైతులకు మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు విషపు ఎర తయారీ విధానంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విద్యార్థినులు తేజస్విని, సమత, లావణ్య, అఖిల, అంజలి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో కష్టపడి చదవాలి



విద్యార్థుల ప్రేరణ తరగతిలో మాట్లాడుతున్న డీఈవో గోవిందరాజులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 22 : విద్యార్థులు ప్రణాళికతో కష్టపడి చదవాలని డీఈవో గోవిందరాజులు కోరారు. కల్వకుర్తి పట్టణంలో జిల్లా విద్యాశాఖ సేవ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ పబ్లిక్ స్కూల్స్, వందేమాతరం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు ముఖ్య వక్తగా వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ హాజరయ్యారు. ఎంఈవో బాసునాయక్, పలువురు హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వకుర్తి డీఎస్పీగా పల్లె వెంకటేశ్వర్లు



డీఎస్పీను సన్మానిస్తున్న ఎస్ఐ

కల్వకుర్తి, ఫిబ్రవరి 22 : కల్వకుర్తి డీఎస్పీగా పల్లె వెంకటేశ్వర్లు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని స్పెషల్ బ్రాంచ్‌లో డీఎస్పీగా పని చేసిన వెంకటేశ్వర్లు బదిలీపై కల్వకుర్తికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీని సీఐ నాగార్జున, ఎస్ఐ జి.మాధవరెడ్డిలు స్వాగతం పలికి శాలువా, పూల మాలతో సత్కరించారు.

'తప్పనిసరిగా టీకాలు వేయించాలి'

చారకొండ, ఫిబ్రవరి 22: క్రాస్‌బ్రీడ్ ఆవులకు థైలారియాసిస్ టీకాలను రైతులు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని జూపల్లిలో 100 క్రాస్ బ్రీడ్ ఆవులకు థైలారియాసిస్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ క్రాస్‌బ్రీడ్ ఆవులకు థైలారియాసిస్ వ్యాధి సోకితే మృత్యువాత పడే అవకాశం వుందని రైతులు అప్రమత్తంగా ఉండి థైలారియాసిస్ సోకకుండా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని పేర్కొన్నారు. వీఎల్‌వో షేక్ మదర్, వెంకటేశ్వర్లు, శివరాం, మల్లయ్య, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి

వెల్దండ, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని అంకమోని కుంట గ్రామానికి చెందిన గుండ్లపల్లి వెంకట్‌నారాయణరెడ్డి అనే రైతుకు చెందిన పాడిఆవు ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరు తగిలి సుమారు 80 వేల విలువగల ఆవు మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ అధికారులకు, వ్యవసాయ అధికారులకు జరిగిన విషయంపై వెంకట్‌నారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. తనను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతు కోరారు.

అడవి జంతువు దాడిలో..

వంగూరు, ఫిబ్రవరి 22: మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో బుధవారం రాత్రి ఆడవి జంతువు దాడిలో పాడి ఆవు మృతి చెందింది. రైతు బయ్య శ్రీనుకు చెందిన పొలంలోని దొడ్డిలో ఉన్న ఆవుపై అడవి జంతువు దాడి చేసి మెడ భాగాన్ని కొరికి చంపింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న అటవిశాఖ అధికారిణి రమణి గురువారం సంఘటన స్థలానికి వెళ్లి, జంతువు పాదముద్రలను పరిశీలించారు. దాడి చేసింది హైనా అయ్యి ఉండవచ్చని ఆమె తెలిపారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : విద్యాక్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపూర్‌లో చారిత్రాత్మక కట్టడమైన శ్రీరంగనాథ స్వామి దేవాలయాన్ని డిగ్రీ కళాశాల విద్యార్థులు సందర్శించారు. విద్యా క్షేత్ర పర్యటనలో కళాశాల ప్రిన్సిపాల్ ఇటికల రామరాజుయాదవ్ విద్యార్థులకు పురాతన ప్రాచీన దేవాలయ ఆవశ్యకతను, చరిత్రను, నాటి పురాతన కట్టడాలపై, వాటి పరిరక్షణ కోసం ఎలా యువత ముందుకు రావాలనే అంశంపై విద్యార్థులకు వివరించారు. భారతీయ సనాతన ధర్మానికి సంబంధించి ఆనాటి హైందవ ధర్మాలకు సంబంధించి ఉన్న చారిత్రాత్మకమైన విషయాలను ఆయన విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పైర్ల పరిశీలన

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న యాసంగి వరి పంటలను గురువారం వ్యవసాయ విస్తరణ అధికారిణి మౌనిక పరిశీలించారు. వరి పంట 40 నుంచి 60రోజుల కీలక దశలో ఉందని ఈ దశలో వరి పంటకు బ్యాక్టీరియా, ఆకు ఎండు, వేరుకుళ్లు తెగులు వస్తున్నాయన్నారు. దీని వల్ల ఆకుల అంచులు పసుపుగా మారి కొనలు ఎరుపుగా మారి ఎండిపోతున్నాయన్నారు. దీని నివారణకు ప్లాంటోమైథిన్ 100 గ్రాములు ఎకరాకు ప్రోఫికోనాజాల్ 200ఎంఎల్ ఎకరాకు అదేవిధంగా కాండం తొలుచు పురుగు నివారణకు కార్టప్‌హైడ్రోక్లోరైడ్ 400గ్రాములు ఎకరాకు పిచికారి చేసుకుని రైతులు వరి పంటలను కాపాడుకోవాలని రైతులకు సూచించారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

తెలకపల్లి, ఫిబ్రవరి 22: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న నర్సరీలను ఎంపీడీవో కృష్ణయ్య గురువారం పరిశీలించారు. మండలానికి నూతనంగా వచ్చిన ఎంపీడీవో కృష్ణయ్య జంగమోనిపల్లి, లక్నారం, కామారెడ్డిపల్లి, గోలగుండం గ్రామాల్లో ఉన్న నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున సకాలంలో నర్సరీలకు నీళ్లు పట్టాలని మొక్కలను జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన కార్యదర్శులను సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, ఏపీవో మల్లేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను తీర్చాలి



తాగునీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్

ఊర్కొండ, ఫిబ్రవరి 22: గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఊర్కొండ మండలం ఊర్కొండపేటలోని ఎస్సీ బుడగ జంగాల కాలనీలో తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నామని ఆ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మిషన్ భగీరథ నీటితో పాటు గ్రామపంచాయతీ బోరు గుండా నీటి సరఫరా చేసేవారని, వేసవి కాలం ప్రారంభ కావడంతో భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా కాకపోవడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ వారు ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నప్పటికీ అవి సరిపోవడంలేదని, ట్యాంకర్ తో రెండు, మూడు రోజులకు ఒకసారి బిందెడు నీరు ఇవ్వడంతో కాలకృత్యాలు తీర్చుకోడానికి కూడా సరిపోవడం లేదని వాపోతున్నారు. ప్రత్యేక అధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నతాధికారులు ఎస్సీ బుడగ జంగాల కాలనీలో తాగునీటి సమస్య కొరతను తీర్చాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.